సాక్షి
ప్రకాశం

ఆదివారం ı 17 ı డిసెంబర్ ı 2023



పశ్చిమ ప్రకాశానికి మెడికల్ కాలేజీ ఓ వరం

మార్కాపురం మెడికల్ కాలేజీలో నెఫ్రాలజీ, యూరాలజీ విభాగాలు ఏర్పాటు చేయడం హర్షణీయమని ఎమ్మెల్యే కేపీ అన్నారు.

- 8లో..



లారీని ఢీకొని బొలెరో దగ్ధం

లారీని బొలెరో వాహనం ఢీకొని బొలెరో దగ్ధమైన ఘటన మార్కాపురం మండలం నికరం పల్లె వద్ద జరిగింది. ఈ ఘటనలో ఒకరు మృతిచెందారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
29.7/24.1

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఎస్పీ మలికాగర్గ్‌కు డీజీపీ డిస్క్ అవార్డు



డీజీపీ డిస్క్ అవార్డు అందుకున్న ఎస్పీ మలికా గర్గ్‌ను అభినందిస్తున్న డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి

ఒంగోలు టౌన్: ప్రకాశం జిల్లా ఎస్పీ మలికా గర్గ్‌కు మరో అవార్డు దక్కింది. 2022 సంవత్సరంలో శాంతి భద్రతల పరిరక్షణ, కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్, దిశ కేసుల్లో వేగంగా స్పందించి పరిష్కారం చూపడం తదితర విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను ఆమెకు ఈ ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. కీలక కేసుల్లో నిందితులకు 100 శాతం శిక్షలు పడేలా కృషి చేసినందుకు గుర్తింపు లభించింది. డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి చేతుల మీదుగా మంగళగిరిలో శనివారం ఈ అవార్డును అందుకున్నారు. అలాగే మద్దిపాడు పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న యం.కృష్ణమూర్తి డీజీపీ కమెండేషన్ అవార్డును అందుకున్నారు. ప్రతిష్టాత్మక అవార్డు అందుకున్న ఎస్పీ మలికా గర్గ్‌ను జిల్లా పోలీసులు అభినందనలు తెలిపారు.


23 నుంచి రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలు

ఒంగోలు రూరల్: క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, బాలినేని ప్రణీత్‌రెడ్డి సౌజన్యంతో అంచిపోగు రమేష్ బాబు ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలు డిసెంబరు 23, 24, 25 తేదీల్లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నాకౌట్, లీగ్ పద్ధతిలో కరవదిలోని అంబేద్కర్ నగర్ క్రీడా ప్రాంగణంలో పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు బహుమతులు వరుసగా రూ.10,116, రూ.7116, రూ.5116, రూ.3116 అందజేయనున్నట్లు నిర్వాహకులు కైలా శ్రీనివాస్ తెలిపారు. క్రీడా పోటీలు ప్రారంభోత్సవ కార్యక్రమానికి సొసైటీ చైర్మన్ వాకా వెంకటకృష్ణారెడ్డి, పొగాకు బోర్డు ఉత్పత్తిదారుల చైర్మన్ వాకా బసివిరెడ్డి, ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లిఖార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు చుండూరి రవిబాబు, ఒంగోలు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ చుంచు రామకృష్ణ పాల్గొంటారన్నారు.

ప్రశాంతంగా ఏకేయూ యూజీ పరీక్షలు

ఒంగోలు: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని రిజిస్ట్రార్ బి.హరిబాబు తెలిపారు. శనివారం నగరంలోని డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ, బీపీ అండ్ కేఆర్ డిగ్రీ కాలేజీలోని పరీక్ష కేంద్రాన్ని ఆయనతోపాటు అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బి.పద్మజ తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహిస్తుండడంతో సంబంధిత కాలేజీ వారిని అభినందించారు.

ఏపీ హ్యాండ్ బాల్ మహిళా జట్టు మేనేజర్‌గా నరసింహారావు



కాలే నరసింహారావు (ఫైల్)

దొనకొండ: ఆంధ్రప్రదేశ్ హ్యాండ్ బాల్ మహిళా జట్టు మేనేజరుగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఫిజికల్ డైరెక్టర్ కాలే నరసింహారావును స్కూల్ గేమ్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారు నియమించారు. ఈ నెల 16 నుంచి 21 వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు ఢిల్లీలో నిర్వహించే నేషనల్ అండర్ 14 హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌కు నరసింహారావు మేనేజర్‌గా విధులు నిర్వహిస్తారు. ఆయనను మేనేజర్‌గా నియమించడంపై మండల వ్యాయామ ఉపాధ్యాయులు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

సిరిధాన్యాలు



సాగులో ఉన్న కొర్ర పంట



చిరుధాన్యాల పోషకాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ (ఫైల్)

మారుతున్న ఆహారపు అలవాట్లతో చిన్నవయసులోనే అనారోగ్యం పాలవుతున్నారు. దీంతో మళ్లీ పాతకాలపు ఆహార ధాన్యాల వైపు ప్రజలు మొగ్గుచూపుతున్నారు. తృణధాన్యాలను ఆహారంగా తీసుకుంటున్నారు. ఫలితంగా తృణధాన్యాలకు డిమాండ్ పెరగడంతో రైతులు వాటిని సాగుచేస్తున్నారు. క్రమంగా జిల్లాలో తృణధాన్యాల సాగు పెరుగుతోంది. ప్రభుత్వం కూడా వాటి సాగును ప్రోత్సహిస్తోంది. రైతులకు అవగాహన కల్పిస్తోంది. జాతీయ తృణధాన్యాల సంవత్సరంగా 2023ను ప్రకటించటంతో రైతులకు ప్రభుత్వం మినీకిట్స్‌ను, సబ్సిడీపై యంత్రాలను అందించి ప్రోత్సహిస్తోంది.

- తృణ ధాన్యాలతో ఆరోగ్యం పదిలం
- పెరుగుతున్న చిరుధాన్యాల వినియోగం
- తక్కువ ఖర్చుతో రైతులకు ఆదాయం
- జిల్లాలో 13,278 ఎకరాల్లో సాగు
- సాగును ప్రోత్సహిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ఒంగోలు సెంట్రల్: నాగరికత కొత్త పుంతలు తొక్కుతోంది. ఆహారపు అలవాట్లను కూడా మార్చేసింది. రెండు, మూడు దశాబ్దాల క్రితం వరకు తృణ ధాన్యాలనే ఆహారంగా తీసుకున్న తరం ఇప్పటికీ ఆరోగ్యంగా ఉంది. నేటి తరం ఆహార అలవాట్లతో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటోంది. దీంతో ప్రజలు మళ్లీ తృణ ధాన్యాల వైపు మొగ్గు చూపుతున్నారు. తృణధాన్యాలైన రాగులు, సజ్జలు, కొర్రలు, ఊదలు, సామలు, జొన్నలలో ఉండే పీచు పదార్థం వల్ల తిన్న వెంటనే గ్లూకోజ్‌గా మారకుండా కొద్ది కొద్దిగా అవసరమైనంత మేరకు మాత్రమే రక్తంలో కలుస్తుంది. జిల్లాలో ఖరీఫ్, రబీలలో కలిసి తృణ



జొన్న పంట

ధాన్యాలు 13,278 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఖరీఫ్‌లో విత్తనం నాటిన తర్వాత మోస్తరు వర్షం కురిసినా పంట చేతికి వస్తుంది. వీటి పంట కాల పరిమితి రెండు మూడు నెలలే కావటంతో స్వల్ప వ్యవధిలో రైతు ఇంటికి ధాన్యం చేరుతుంది. చీడ పీడలు ఆశించటం కూడా తక్కువే. మళ్లీ రెండో పంట సాగు చేసుకోవటానికి కూడా వీలుగా ఉంటుంది. వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం జిల్లాలో కొర్ర 978 ఎకరాలు, సజ్జ 11877 ఎకరాలు, జొన్న 308 ఎకరాలు, రాగులు 105 ఎకరాలు, వరిగ 10 సాగు చేస్తున్నారు. వర్షాలు పడి తగ్గుముఖం పట్టినందున మరింత సాగు పెరిగే అవకాశం ఉంది. మార్కెట్‌లో వీటికి మంచి డిమాండ్ పెరుగున్నందున రైతులు సాగుకు మొగ్గు చూపుతున్నారు.

మద్దతు ధరతో కొనుగోలు:

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో చిరుధాన్యాలు కొనుగోలు చేయనున్నారు. ఇందులో జొన్నలు క్వింటాలుకు రూ.3225, రాగులు రూ.3846, కొర్రలు



సబ్సిడీపై అందిస్తున్న పలు రకాల మిషన్స్

రూ.2500లగా నిర్ణయించటంతో పాటు మార్కెట్‌లో నేరుగా డిమాండ్ ఉండటంతో రైతులు తినటానికి పోను, కావాల్సిన మేర అమ్ముకుంటున్నారు.

రైతులకూ లాభదాయకం..

చిరుధాన్యాల సాగు ప్రస్తుతం అన్నదాతలకు లాభదాయకంగా ఉంది. హైదరాబాద్ లోని ఐఐఎంఆర్ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్) నాణ్యమైన చిరుధాన్యాల సీడ్‌ను రైతులకు విక్రయిస్తోంది. జిల్లాలో కొందరు రైతులు వాటిని కొనుగోలు చేసి విత్తుకుంటున్నారు. దిగుబడులు రాగానే వాటిని మార్కెట్‌లో విక్రయించుకుని



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

లాభాలు పొందుతున్నారు. అధిక మొత్తంలో హైదరాబాద్ నుంచి సీడ్ తెచ్చుకున్న కొందరు వాటిని బై బ్యాక్ ఒప్పందంలో రైతులకు ఇచ్చి ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. జాతీయ తృణధాన్యాల సంవత్సరంగా 2023ను ప్రకటించటంతో సాగుకు రైతులకు ప్రభుత్వం మినీకిట్స్‌ను అందించి ప్రోత్సహించింది. సలహాలు, సూచనలు అందిస్తోంది. రాష్ట్రంలో పలువురు వ్యవసాయశాఖాధికారులకు సైతం హైదరాబాద్‌లో ఐఐఎంఆర్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అందులో తాళ్లూరు మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు సైతం పాల్గొన్నారు.

వీటికి డిమాండ్:

సిరి ధాన్యాలుగా పిలిచే తృణ ధాన్యాలు మార్కెట్‌లో మంచి రేటు పలుకుతున్నాయి. ప్రజల ఆహారపు అలవాట్లలో మార్పు వస్తుండటంతో చిరుధాన్యాల వినియోగం పెరిగింది. కొందరు వ్యాపారులు తృణ ధాన్యాలను రైతుల నుంచి కొనుగోలు చేసి జల్లెడ పట్టి గ్రేడింగ్ చేసి వ్యాక్యూమ్ ప్యాకెట్లలో నింపి మార్కెట్ చేస్తున్నారు.

50 శాతం సబ్సిడీపై రైతులకు ప్రాసెసింగ్ యూనిట్స్

అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవం సందర్భంగా రైతులకు ప్రాసెసింగ్ యూనిట్స్‌ను 50 శాతం రాయితీపై అందిస్తున్నారు. చిరుధాన్యాల ఉత్పత్తుల విలువ పెంపు ఆధారిత ప్రక్రియలో భాగంగా అందిస్తున్నారు. జాతీయ ఆహార భద్రత మిషన్ ద్వారా గ్రేడర్, డస్ట్ ఆస్పిరేటర్ రూ.1.20 లక్షలు, డీస్కర్ లేదా డి హల్లర్ రూ.2.10 లక్షలు, పాలిషర్ రూ.1.05 లక్షలు, రాగి పీలర్ రూ.1.05 లక్షలు, పల్వరైజర్ లేదా మిల్లర్ రూ.22 వేలు, మిల్లెట్స్ మిల్ లేదా ఫ్లోర్ మిల్ రూ.1 లక్షకు సబ్సిడీపై అందిస్తున్నారు.

చిరుధాన్యాలకు మంచి డిమాండ్



చిరుధాన్యాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. రైతుల వద్ద నేరుగా వ్యాపారులు కొనుగోలు చేసి మార్కెట్‌కు తరలిస్తున్నారు. గత సంవత్సరం మంచి ధరలు రావటంతో ఈ సంవత్సరం కూడా సాగు పెరిగింది. ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల్లో కొంత తగ్గినా, రబీలో ప్రస్తుతం పెరిగే అవకాశం ఉంది.

– నాగార్జున, కొత్తపాలెం

వినియోగంపై విస్తృత అవగాహన



చిరుధాన్యాల సాగు, చిరుధాన్య ఉత్పత్తుల వినియోగంపై రైతులకు, ప్రజలకు, విద్యార్థులకు, పొదుపు సంఘాలకు, అంగన్‌వాడీ, ఉద్యోగులకు, ఆరోగ్య, ఆశ, ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

– ప్రసాదరావు, తాళ్లూరు

చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నాం



చిరుధాన్యాల సాగును విస్తృతంగా ప్రోత్సహిస్తున్నాం. మద్దతు ధర కల్పించటంతో పాటు చిరుధాన్యాల కిట్స్‌ను అందించటంతో సాగుకు మరింత ఊతం ఇచ్చినట్లయింది. రబీలో తక్కువ కాల వ్యవధి పంటల్లో రైతులు మరింతగా సాగు చేసుకునే అవకాశం ఉంది.

– ఎస్ శ్రీనివాసరావు, జేడీఏ, ఒంగోలు

ఆక్వారంగానికి సీఎం వైఎస్ జగన్ ఊపిరి

- ఆక్వాకల్చర్ యాక్ట్‌తో మరింత ఉపయోగం
- విద్యుత్ సబ్సిడీతో ఎంతో మేలు
- దేశీయ మార్కెట్ పెంచుకోవటంపై మరింత దృష్టి
- ఆక్వా వర్సిటీని ఏర్పాటు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్
- అప్సడా రాష్ట్ర వైస్ చైర్మన్ రఘురాం



రొయ్యల సదస్సులో మాట్లాడుతున్న అప్సడా రాష్ట్ర వైస్ చైర్మన్ రఘురాం

ఒంగోలు సెంట్రల్: ఆక్వా రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2020 ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేసి విద్యుత్ సబ్సిడీ ఇచ్చి ఆక్వా రైతులకు ఊపిరి పోశారని ఆంధ్రప్రదేశ్ కోస్టల్ ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) రాష్ట్ర వైస్ చైర్మన్ వి.రఘురాం అన్నారు. ఒంగోలులోని ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో శనివారం రొయ్యల రైతుల సదస్సు నిర్వహించారు. రొయ్యల రైతుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు దుగ్గినేని గోపీనాథ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అప్సడా రాష్ట్ర చైర్మన్ వి.రఘురాం మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యుత్ సబ్సిడీ ఇవ్వడంతో ఇబ్బందుల్లో ఉన్న ఆక్వా సాగు మళ్లీ సాధ్యమైందని చెప్పారు. ఆక్వా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రూపంలో రూ.2800 కోట్లు ఇచ్చిందన్నారు. చైనా, అమెరికా మార్కెట్‌పై ఆధారపడకుండా 3 నుంచి 4 లక్షల టన్నుల ఆక్వా ఉత్పత్తులు దేశీయ మార్కెట్‌లో అమ్ముడు పోయేందుకు సీఎం వైఎస్ జగన్ 'ఫిష్ ఆంధ్రా' ను ఏర్పాటు చేశారన్నారు. అలాగే ఆక్వా యూనివర్శిటీని పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నూతన రొయ్య సీడ్స్‌ను కనుగొనేందుకు శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చేలా రైతులకు అండగా నిలిచేందుకు సీఎం కృషి చేస్తున్నారని అన్నారు. ఆక్వా కల్చర్ అథారిటీ ఏర్పాటు చేసి రైతులను ప్రభుత్వం ఆదుకుంటోందని చెప్పారు. అప్సడా నిరంతరం ఆక్వా రైతులకు అండగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో 4 లక్షల 65 వేల ఎకరాలు సాగు చేస్తుంటే పది ఎకరాల లోపు ఉన్న రైతులకు విద్యుత్ యూనిట్ రూ.1.50 సబ్సిడీ ఇచ్చారని తెలిపారు. ఈ-ఫిష్ సర్వే చేసిన తర్వాత 1.44 లక్షల ఎకరాలు మాత్రమే వచ్చిందని, అయితే సర్వే సక్రమంగా జరగలేదని సీఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. సీఎం ఆదేశాలతో తిరిగి సర్వే చేయడంతో 3.45 లక్షల ఎకరాలు ఆక్వా జోన్ పరిధిలోకి వచ్చిందన్నారు. సీఎం దృష్టికి ఆక్వా రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తీసుకెళ్లి పరిష్కరిస్తున్నారు. నూతన విద్యుత్ కనెక్షన్లపై ఉన్న సమస్యలను కూడా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, ఇంకా లబ్ధి పొందాల్సిన రైతుల విషయంలో అప్రమత్తంగా ఉన్నామని తెలిపారు. తిరుపతి, నెల్లూరు, కావలి, ఒంగోలు పరిధిలో విద్యుత్ కనెక్షన్లు 4623 కనెక్షన్లు ఇచ్చామన్నారు. ఇంటర్నేషల్ మార్కెట్ నుంచి వచ్చే సీడ్ విషయంలో కూడా రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్రం నలుమూలలా 20 సమావేశాలు నిర్వహించి ఆక్వా రైతుల సమస్యలపై చర్చించామని తెలిపారు. మార్కెట్‌లో ధరలు నిలకడగా ఉండేలా చూశామని, ఫీడ్ పెంచిన సమయంలో కూడా సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి రోల్ బ్యాక్ చేయడం తమ అథారిటీ సాధించిన విజయమన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా చేస్తున్న సీడ్ కంపెనీలను కోస్టా ఆక్వాకల్చర్ అథారిటీతో మాట్లాడి మూసివేయించామన్నారు. ఆక్వా రైతులకు అవసరమైన ప్రతి విషయంలో సీఎం వైఎస్ జగన్ ఎంతో మేలు చేస్తున్నారని వివరించారు. కొంత మంది రైతులు ఆక్వాకల్చర్ చేస్తామని చెబుతున్నారని, వారి విషయం కూడా సీఎం దృష్టికి తీసుకువెళ్తే చేయండని సీఎం కూడా ప్రోత్సహించి అందుకు తగిన ఆదేశాలు ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కూడా రైతులు టైగర్ సీడ్‌తో నష్టపోయిన విషయాలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సీడ్ కంపెనీని పిలిపించి రైతులకు న్యాయం చేసేలా కృషి చేశారని తెలిపారు. కోస్తాంధ్రలో విపరీతమైన లీజులు పెరిగాయని, దీంతో రైతులు నష్టపోతున్న విషయం తెలుసుకుని లీజుదారులతో చర్చలు జరిపి ఆక్వా రైతులకు లీజు రేట్స్ తగ్గించామని న్యాయం చేశామని చెప్పారు. రొయ్యల రైతులు ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు ఐవీఆర్ మోహన్‌రాజు మాట్లాడుతూ ఉత్పత్తి పెరుగుతుందని, డిమాండ్ తగ్గుతుందని దేశీయ మార్కెట్ పెంపొందించుకోవటానికి అందరూ సహకరించాలని కోరారు. పలు సూచనలు చేశారు. రొయ్యల రైతులు ఫెడరేషన్ సంఘ జిల్లా అధ్యక్షుడు దుగ్గినేని గోపీనాథ్ రొయ్యల రైతులు క్షేత్ర స్థాయిలో ఎదుర్కొటున్న పలు సమస్యలను, విద్యుత్ సమస్యలను అప్సడా రాష్ట్ర వైస్ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కనుమూరి భాస్కర్‌రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం వెంకటేశ్వరరావు, మత్స్యశాఖ జేడీ అవుల చంద్రశేఖర్‌రెడ్డి, సంఘ గౌరవ అధ్యక్షుడు చాపల రమణయ్య, జిల్లా నాయకులు కె.సుబ్బారెడ్డి, ఎస్.అంజిబాబు పాల్గొన్నారు.

దామచర్ల శవరాజకీయాలు సిగ్గుచేటు

- దళితులకు వ్యతిరేకంగా దామచర్ల అగ్రకుల రాజకీయాలు
- రూ.10 లక్షలు ఇస్తేనే బయట పడతావని టీడీపీ నాయకులు బెదిరిస్తున్నారు
- నేను నిరుపేద దళితుడ్ని.. అన్ని లక్షలు ఇవ్వలేను
- నాకు ఏదైనా జరిగితే దామచర్లదే బాధ్యత
- టిప్పర్ యజమాని దాసరి ఉదయకుమార్

ఒంగోలు టౌన్:

యరజర్ల వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదం విషయంలో టీడీపీ నాయకులు రూ.10 లక్షలు డిమాండ్ చేస్తున్నారని, మేము అడిగినంత ఇస్తేనే బయట పడతావు లేకుంటే లేదని బెదిరింపులకు దిగుతున్నారని టిప్పర్ యజమాని దాసరి ఉదయ కుమార్ ఆరోపించారు. శనివారం రాత్రి కలెక్టరేట్ వద్ద అంబేద్కర్ విగ్రహం ఎదుట వెంగముక్కలపాలెం దళితులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తన వద్ద అంత డబ్బులేదని, భయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశాడు. దళితుడినైన తనను ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, అగ్రకుల నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నారని చెప్పారు. దామచర్ల ఇంటి ముందుకు వెళ్లి ఏదైనా చేసుకోవాలనిపిస్తుందన్నారు. నాకు ఏదైనా జరిగితే దామచర్ల జనార్దన్ బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. 4 నెలల క్రితమే తాను శ్రీరాం ఫైనాన్స్‌లో అప్పు తీసుకొని టిప్పర్ కొనుగోలు చేశానని, రెండు నెలలుగా ఇసుక వ్యాపారం చేస్తున్నానని వివరించారు. టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నట్లు ఎవరికీ సంబంధం లేదన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే తానే స్వయంగా డ్రైవర్ని పోలీసులకు అప్పగించానని చెప్పారు. ప్రమాదం జరిగిన తరువాత క్విస్ కళాశాల యాజమాన్యంతో మాట్లాడానని, నష్ట పరిహారం చెల్లించాలని రూ.5 లక్షలు అడిగారని, తాను అంత ఇవ్వలేనని చెప్పగా రూ.3 లక్షలు ఇచ్చేలా మాట్లాడి నన్ను రిమ్స్ ఆస్పత్రి వద్దకు తీసుకెళ్లారని తెలిపారు. అయితే సాయంత్రం టీడీపీ నాయకులు వచ్చి ధర్నాకు దిగడంతో భయంతో వెళ్లి పోయానని చెప్పారు.



మీడియాతో మాట్లాడుతున్న ఉదయకుమార్


బాధిత కుటుంబాన్ని ఆదుకోవాల్సిన టీడీపీ నాయకుడు దామచర్ల జనార్దన్ బాధలో ఉన్న ఆ కుటుంబాన్ని రోడ్డు మీదకు తీసుకొచ్చి శవ రాజకీయాలు చేయడం సిగ్గుచేటని వెంగముక్కలపాలెం దళిత నాయకులు ఆరోపించారు. అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఉదయ్‌కుమార్ అనే దళిత యువకుడు టిప్పర్ లారీ కొనుక్కొని బాడుగకు తిప్పుకుంటూ కుటుంబాన్ని పోషించుకోవడం సహించలేక పోతున్నారని మండిపడ్డారు. మేము దళితులం కనుకనే బెదిరింపులకు పాల్పడుతున్నారని, పరిహారం పేరుతో ఎక్కువ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారని విమర్శించారు. రాజకీయ స్వలాభం కోసం రాజకీయ ఆరోపణలు చేస్తున్నారని , దామచర్ల రాజకీయ ప్రయోజనం కోసమే మృతుడి కుటుంబాన్ని రోడ్డు మీదకు తీసుకొచ్చారన్నారు. మృతుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించేందుకు కుదిరిన ఒప్పందాన్ని తెలుగుదేశం నాయకులు చెడగొట్టారని చెప్పారు. దళిత కుటుంబం మీద జనార్దన్ కుట్రలకు పాల్పడుతున్నారని, మాకు ఏదైనా జరిగితే జనార్దన్ పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

గ్రూప్-2 పరీక్షలకు ఉచిత శిక్షణ

- ఈనెల 22 లోపు దరఖాస్తు చేసుకోవాలి
- బీసీ స్టడీ సర్కిల్ ఒంగోలు సంచాలకులు అంజలి

ఒంగోలు సెంట్రల్: ఆంధ్రప్రదేశ్ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఏపీపీఎస్సీ గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షలకు ఉచిత శిక్షణకు ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ బీసీ స్టడీ సర్కిల్ ఒంగోలు సంచాలకులు ఎం. అంజలి తెలిపారు. ఈనెల 22వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. 60 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. 50 రోజుల పాటు శిక్షణ ఉంటుందని శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ ఇస్తామని చెప్పారు. అభ్యర్థుల ఎంపిక డిగ్రీలో వచ్చిన మార్కుల మెరిట్ ఆధారంగా జరుగుతుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు పదో తరగతి మార్క్ లిస్ట్, ఇంటర్, డిగ్రీ మార్క్ లిస్ట్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంక్ పాస్ బుక్ జెరాక్స్‌లు, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో ఈనెల 22వ తేదీ లోపు దరఖాస్తులను అందించాలని కోరారు. కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న గవర్నమెంట్ ఆఫీస్ కాంప్లెక్స్‌లో ఏపీ బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు ఇవ్వాలని చెప్పారు. ఇతర వివరాలకు ఏపీ బీసీ స్టడీ సర్కిల్, ఫోన్ నంబర్ 08592-231232, 9989285530, 8985090926లను సంప్రదించాలని కోరారు.

బాలుడు అదృశ్యం


కుంభ హరీష్ (ఫైల్)

సింగరాయకొండ: బాలుడు కుంభ హరీష్ (12) అదృశ్యమైన సంఘటన శుక్రవారం పాతసింగరాయకొండ పంచాయతీ బాలిరెడ్డి నగర్ ఎస్టీ కాలనీలో జరిగింది. హరీష్ తల్లిదండ్రులు పెంచలయ్య, విజయలక్ష్మి కథనం ప్రకారం శ్రీ విద్యా నికేతన్ స్కూలు 5వ తరగతి చదువుతున్నాడని, శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో పసుపు రంగు షార్ట్, మెంతికలర్ టీ షర్ట్ ధరించి బయటకు వెళ్లాడని తరువాత ఇంటికి తిరిగి రాలేదన్నారు. హరీష్ కోసం ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవటంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. హరీష్ దొరికితే సెల్: 9121102135, 9121102136 నంబర్లుకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటన పై కేసు రిజిస్టరు చేసి బాలుని కోసం దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై టి. శ్రీరాం వివరించారు.

పశ్చిమ ప్రకాశానికి మెడికల్ కాలేజీ ఓ వరం

- నెఫ్రాలజీ, యూరాలజీ విభాగాల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం
- సీఎం జగనన్నకు ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే కేపీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ, పక్కన ఇస్మాయిల్ తదితరులు (సాక్షిలో వచ్చిన వార్తను చూపుతున్న ఎమ్మెల్యే)

మార్కాపురం: మార్కాపురం మెడికల్ కాలేజీలో నెఫ్రాలజీ, యూరాలజీ విభాగాలను ఏర్పాటు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కాబినేట్ మీటింగులో ఆమోదం తెలపడం సంతోషకరమని ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి అన్నారు. శనివారం మార్కాపురంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ పశ్చిమ ప్రకాశానికి మెడికల్ కాలేజీ ఓ వరమని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరితో పాటు తూర్పు ప్రకాశంలోని దర్శి నియోజకవర్గాలకు చెందిన కిడ్నీ, ఫ్లోరోసిస్ బాధితులకు వచ్చే ఏడాది మెరుగైన వైద్యసేవలు అందనున్నాయన్నారు. ఈ ప్రాంత ప్రజల తరఫున ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతూ పాదాభివందనం చేస్తున్నట్లు తెలిపారు.

వచ్చే ఏడాది సెప్టెంబరులో మార్కాపురం మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ప్రవేశాలు ప్రారంభం అవుతాయన్నారు. అడ్మిషన్లు ప్రారంభించేలోపే కిడ్నీ పేషెంట్ల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వారికి భరోసా కల్పిస్తూ యూరాలజీ, నెఫ్రాలజీ విభాగాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 475 కోట్ల రూపాయలతో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, మొత్తం 18 బ్లాకుల పనులు వివిధ దశల్లో ఉన్నాయని ఎమ్మెల్యే చెప్పారు. మెడికల్ కళాశాల నిర్మాణం, కిడ్నీ రీసెర్చ్ సెంటర్ వలన ఈ ప్రాంతంలోని యువతకు ఉద్యోగాలు రానున్నాయని చెప్పారు. ఇప్పటికే మార్కాపురం జిల్లా వైద్యశాలను అప్‌గ్రేడ్ చేశారని, 49 మంది వైద్యులు పని చేస్తున్నారన్నారు. ప్రతి రోజూ దాదాపు 600 మంది ఓపీ విభాగంలో సేవలు పొందుతున్నారని, 200 బెడ్లు అందుబాటులోనికి వచ్చాయని, మరో 120 బెడ్లు ఈ నెలాఖరు లోపు రానున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. జిల్లాలో రెండో మెడికల్ కళాశాలను మార్కాపురంలో ప్రారంభించి ముఖ్యమంత్రి ఈ ప్రాంత ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. మార్కాపురం చుట్టుపక్కల 70 కిలోమీటర్ల పరిధిలో ఉండే ప్రజలకు సేవలందనున్నాయన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా చేపడుతున్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించుకుని 175 సీట్లకు 175 సీట్లు బహుమతిగా ఇవ్వాలన్నారు.

రామోజీ... బైజూస్ యాప్ గురించి నీకు తెలుసా?

ఈనాడు సంస్థల చైర్మన్ రామోజీరావుకు బైజూస్ యాప్ గురించి తెలియక టీడీపీ కార్యకర్తలతో ప్రకటనలు ఇప్పిస్తూ, రోత రాతలు రాయిస్తూ ప్రజల మనసులను పాడుచేస్తున్నారని, ఇలా చేయవద్దని ఎమ్మెల్యే కేపీ సూచించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బైజూస్ యాప్ ప్రాచుర్యం పొందిందని, చాలా మంది ట్యూటర్లు ఈ యాప్‌ను ఉపయోగిస్తారన్నారు. 8వ తరగతి నుంచే విద్యార్థులకు అన్ని అంశాలపై సమగ్ర సమాచారం కోసం ముఖ్యమంత్రి ట్యాబులిస్తే దానిపై కూడా టీడీపీ కార్యకర్తలతో లేనిపోని విధంగా తప్పుడు సమాచారమిస్తూ చెడురాతలు రాస్తున్నారన్నారు. ఎక్కడో ఒక చోట తప్పు జరిగిందని, రాష్ట్రమంతా బైజూస్ యాప్, ట్యాబ్‌ల వలన విద్యార్థులు నష్టపోతున్నారనడం మంచిది కాదన్నారు. ప్రతి ఇంటిలో సెల్‌ఫోన్లున్నాయని, అందులోకూడా ఇంటర్నెట్ కనెక్షన్ ఉంటుందని రామోజీ గుర్తిస్తే మంచిదని చెప్పారు. సమావేశంలో పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ 2 అంజమ్మ శ్రీనివాసులు, పార్టీ ప్రధాన కార్యదర్శి రవిచంద్ర, కౌన్సిలర్లు సిరాజ్, కొత్త కృష్ణ, యార్డు డైరెక్టర్ రమణారెడ్డి తదితరులున్నారు.

చెరువులో పడి ప్రాణం విడిచిన యువకుడు

పర్చూరు (చినగంజాం): చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈఘటన మండలంలోని నాగులపాలెం నెహ్రూ కాలనీలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నెహ్రూ కాలనీకి చెందిన యువకుడు బేతా సుదర్శనరావు (18) మూడు రోజుల క్రితం ప్రార్థనకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆ రోజు నుంచి తిరిగి ఇంటికి చేరలేదు. ఈక్రమంలో తన కుమారుడు కనబడటం లేదని తల్లి కోటేశ్వరమ్మ 14వ తేదీ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని యువకుడి కోసం గాలింపు చేపట్టారు. ఇదిలా ఉండగా శనివారం ఉదయం చెరువు వద్దకు వెళ్లిన కొందరు స్థానికులకు సుదర్శనరావు శవం నీటిపై తేలుతూ కనబడింది. దాంతో వారు మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చెరువు వద్దకు చేరుకున్న తల్లి కోటేశ్వరమ్మ, ఆమె పెద్దకుమారుడు మృతదేహాన్ని చూసి భోరున విలపించారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై రవిశంకర్ రెడ్డి హుటాహుటిన తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని పంచాయతీ సిబ్బంది సహకారంతో బయటికి తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


సుదర్శనరావు మృతదేహం

మత్స్యశాఖ, ప్రకాశం "సాగర మిత్ర" ఉద్యోగ ప్రకటన

ప్రకటన నెం. 127/C(SM)/2020

మత్స్యశాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ప్రకాశం జిల్లా నందు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకము (PMMSY) క్రింద తాత్కాలిక ప్రాతిపదికన కాంట్రాక్ట్ పద్ధతిపై రోస్టర్ ప్రాతిపదికన మెరిట్ మరియు ఇంటర్వ్యూ ద్వారా (12 మంది) "సాగర మిత్ర"ల నియామకం కొరకు బి.యఫ్.ఎస్.సి., బి.ఎస్.సి. (ఫిషరీస్ / జువాలజీ / మెరైన్ బయాలజీ) అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి. జీతం మరియు అలవెన్స్‌లు కలిపి నెలకు రూ. 15,000/-లు. ధరఖాస్తు ఫారం మరియు వివరములకు జిల్లా మత్స్య శాఖ అధికారి, ప్రకాశం కార్యాలయము, ఒంగోలు దగ్గర పని వేళల్లో స్వయముగా గాని https://prakasam.ap.gov.in నుండి గాని పొందవచ్చు. ధరఖాస్తులు స్వయముగా గాని, పోస్టు ద్వారా గాని దాఖలు చేయడానికి ఆఖరి తేదీ. 31.12.2023 సాయంత్రం 05.00 గంటల లోపు దరఖాస్తులు స్వీకరించబడును. తరువాత దరఖాస్తులు స్వీకరించబడవు.

సం॥ ఎ.ఎస్.దినేష్ కుమార్, I.A.S.
కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్, ప్రకాశం జిల్లా.

నోట్: మరిన్ని వివరములకు ఈ నెం. 9440814738కు సంప్రదించగలరు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

త్రిపురాంతకం: నేషనల్ హైవే ఉమ్మడివరం ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందాడు. త్రిపురాంతకం మండలం ఉమ్మడివరం వద్ద రోడ్డు దాటుతున్న బూసి నరిసింహ (9)ను గుంటూరు వైపు వెళుతున్న కారు ఢీ కొట్టింది. గాతయపడిన బాలుడిని వైద్యం నిమిత్తం గుంటూరు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. తండ్రి చిన్న చిరంజీవి వ్యవసాయ కూలీ. ఇతనికి ముగ్గురు పిల్లల్లో చివరివాడు. నరిసింహ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

హత్య కేసు దర్యాప్తు ముమ్మరం

- స్థానికులను విచారిస్తున్న సీఐ జగదీశ్


హత్యకు గురైన ప్రాంతంలో వివరాలు సేకరిస్తున్న సీఐ జగదీశ్ ఇన్‌సెట్‌లో హత్యకు గురైన రమణమ్మ (ఫైల్)

కొత్తపట్నం: ఈ నెల 12న దారుణ హత్యకు గురైన రమణమ్మ కేసులో పోలీసులు వేగంగా దర్యాప్తు చేస్తున్నారు. రెండో పట్టణ సీఐ జగదీశ్, ఎస్సై బి.సాంబశివరావు తమ సిబ్బందితో శనివారం సంఘటన జరిగిన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. ఎక్కడ హత్య జరిగింది అని ఆరా తీశారు. చెంచుపాపాయిపాలెం గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కాపులు, పెద్దలతో మాట్లాడుతూ ఎన్ని గంటలకు హేచరీకు వెళ్లింది, ఎన్ని గంటలకు ఇంటికి వస్తుంది, ఈ నెల 12న ఎందుకు ఇంటి రాలేదు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ అనురాధ హేచరీ నుంచి ఈతముక్కల చెంచు పాపాయి పాలేనికి వచ్చేదని 12 సాయంత్రం ఇంటికి రాలేదని చెప్పారు. దీంతో గ్రామస్తులు 40 మంది ఈ ప్రాంతమంతా వెతికామని, బంధువుల ఇళ్లలో వెతికామని చెప్పారు.

హేచరీలో పనిచేసే వాళ్లేనా?

హేచరీలో పనిచేసే కూలీలు హత్య చేసి ఉంటారని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. అక్కడ వంట చేయటానికి వెళ్లి ఈ నెల 12న సాయంత్రం 5 గంటల సమయంలో ఇంటికి నడిచి వచ్చే సమయంలో కూలీలు దారుణానికి వడిగట్టి ఉంటారని భావిస్తున్నారు. ఈ నెల 12న సాయంత్రం తల్లి మంగమ్మ కూరకాయలను కుమార్తె రమణమ్మకు ఇచ్చింది. ఆ కూరగాయలు తీసుకుని ఇంటి వచ్చే సమయంలో హత్యకు గురైనట్లు సమాచారం.

పథకం ప్రకారమే హత్య?

పథకం ప్రకారమే హత్య చేయటానికి అన్ని సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. కూరకాయలను తీరం వెంబడి పడేసి ఉండటంతో సముద్రంలో పడి ఆత్మహత్య చేసుకుందని అనుకున్నారు. రెండు రోజులు పాటు సముద్రం వైపు చూశారు. అయినా ఆచూకీ కనిపించలేదు. ఈ క్రమంలో ఈ నెల 15న ఏపీ హేచరీ సమీపాన బట్టలు లేకుండా మృతదేహం లభ్యమయింది. గ్రీన్ మ్యాట్ సహాయంతో తీసికొచ్చి పడేసి వెళ్లినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. మృతదేహం గుర్తు పట్టకుండా ముఖం మీద యాసిడ్ కూడా పోసినట్లు విచారణలో తేలింది. హత్య చేసి సముద్రంలో పడేసి అనుమానం రాకుండా చేసిట్లు అర్థం అవుతోంది. కాగా యాసిడ్‌ను రొయ్య పిల్లల ట్యాంక్‌లను శుభ్రం చేయటానికి ఉపయోగిస్తారు, అలాగే గ్రీన్ మ్యాట్ కూడా హేచరీలో ఉపయోగిస్తారు.

అన్ని కోణాల్లో విచారణ

ఇప్పటికే ఒక వ్యక్తిని అదుపులో తీసుకుని విచారిస్తున్నారు. అనురాధ హేచరీలో పనిచేసే వారి ఫోన్ నంబర్ తీసుకున్నారు. గ్రామంలోని అనుమానితలను కూడా గుర్తిస్తున్నారు. అన్ని కోణాల్లో విచారించి రెండు రోజుల్లో అసలైన నిందితులను అరెస్ట్ చేస్తామని సీఐ జగదీశ్ తెలిపారు.


అనాథలుగా మారిన పిల్లలు

అనాథలుగా మారిన పిల్లలు

ఈతముక్కల గ్రామం చెంచుపాపాయి పాలెం గ్రామానికి చెందిన జాలయ్య రాజుపాలెం పట్టుపుపాలేనికి చెందిన రమణమ్మతో 15 సంవత్సరాల క్రితం వివాహం అయ్యింది. పేద నిరుపేద కుటుంబం. కూలి పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. కుమారుడు, కుమర్తె జన్మించారు. 2020లో కరోనతో భర్త జాలయ్య మృతి చెందాడు. తండ్రి చనిపోవడంతో కొంత బాధ్యతలు కుమారుడు మహేష్‌పై పడింది. ఆర్థిక పరిస్థితులు బాగులేనందున 8వ తరగతి వరకే చదివాడు. రమణమ్మ కూలినాలి పనులు చేసుకుంటూ కుమార్తెను చదివించుకుంటోంది. కుమార్తె సుస్మిత ఈతముక్కల హైస్కూల్‌లో పదో తరగతి చదువుకుంటోంది. నాలుగు నెలలు క్రితం అనురాధ హేచరీలో వంట మనిషిగా రమణమ్మ కుదుర్చుకుంది. తల్లి దండ్రులు మరణించడంతో పిల్లలు భవిష్యత్ అంధకారంగా మారింది.


గుర్తు తెలియని మహిళ మృతి

- మృతదేహాన్ని పొదిలి మార్చురీలో ఉంచిన పోలీసులు



కొనకనమిట్ల: గుర్తు తెలియని వాహనం ఢీ కొని మహిళ మృతి చెందింది. ఈ సంఘటన ఒంగోలు-గిద్దలూరు రహదారి కొనకనమిట్ల మండలం బచ్చలకూరపాడు సమీపంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. గుర్తు తెలియని మతిస్థిమితం లేని మహిళ రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న క్రమంలో వాహనం ఢీ కొట్టడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెంది ఉంటుందని భావిస్తున్నారు. సంఘనా స్థలాన్ని కొనకనమిట్ల పోలీసులు సందర్శించారు. ప్రమాదానికి కారణమైన వాహనం ఆచూకీ గురించి తెలుసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా మహిళ మృతదేహాన్ని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ మార్చురీలో ఉంచుతామని ఎవరైనా మహిళను గుర్తు పడితే 91211 02174 కొనకనమిట్ల ఎస్ఐ ఫోన్ నంబరుకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ బ్రహ్మనాయుడు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


చిరంజీవి (ఫైల్)


ఒంగోలు టౌన్: టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మరణించారు. ఒంగోలు మండలం యరజర్ల గ్రామానికి చెందిన కంకణాల చిరంజీవి (35) ఒంగోలులోని ఒక ప్రైవేటు కళాశాలలో అటెండర్‌గా పనిచేస్తుంటారు. శనివారం ఉదయం యరజర్ల నుంచి మోటారు బైకు మీద వస్తుండగా క్విస్ కాలేజీ దాటిన తరువాత ఎదురుగా ఇసుకలోడుతో వస్తున్న టిప్పర్ లారీ ఢీ కొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. చిరంజీవికి భార్య అనూష , ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జీజీహెచ్ ఎదుట ధర్నా

తమకు న్యాయం చేకూర్చాలంటూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, తెలుగు దేశం నాయకులు జీజీహెచ్ ఆసుపత్రి ఎదుట రోడ్డు మీద ధర్నాకు దిగారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండానే మృతదేహాన్ని తరలించారని ఆరోపించారు. డ్రైవరుని అరెస్టు చేయాలని, మృతుడి కుటుంబానికి న్యాయం చేకూర్చాలని నినాదాలు చేశారు. ఒక సందర్భంలో పోలీసులతో దురుసుగా ప్రవర్తించారు. ద్విచక్రవాహనాలను కూడా అడ్డుకోవడంతో పాటు పాదచారులతో సైతం తెలుగు దేశం నాయకులు ఘర్షణకు దిగడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

చట్టపరంగా చర్యలు తీసుకుంటాం: వి.నారాయణస్వామి రెడ్డి , డీఎస్పీ

ప్రమాద సమాచారం వచ్చిన వెంటనే తాలుకా సీఐ ఘటనా స్థలాన్ని సందర్శించారు. డ్రైవర్‌ను వెంటనే అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకున్నాం.


రోడ్డుపై బైఠాయించిన చిరంజీవి కుటుంబ సభ్యులు


చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


తాళ్లూరు (ముండ్లమూరు): మండంలోని నాగంబొట్లపాలెం గ్రామానికి చెందిన వేడికోల పెద వెంకటరెడ్డి (49) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఏఎస్ఐ మోహనరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన వేడికోల పెద వెంకటరెడ్డి గత రెండు సంవత్సరాలుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. అప్పటి నుంచి ఎన్ని మందులు వాడినా తగ్గలేదు. ఈనెల 14న పొలం వెళ్లి పని చేస్తుండగా కడుపునొప్పి అధికం కావడంతో నొప్పి భరించలేక పొలం వద్ద ఉన్న గడ్డి మందు తాగాడు. చుట్టు పక్కల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు తెలియజేయగా వెంటనే తూర్పుగంగవరంలో ఆర్ఎంపీ డాక్టర్ వద్ద ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం ఒంగోలు అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందగా మృతుడి తమ్ముడు వేడికోల నరసింహారెడ్డి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఇంటర్ చదువుతున్న కొడుకు, పదో తరగతి చదువుతున్న కుమార్తె ఉన్నారు.

వైద్యనిపుణుల పెంపుపై మాగుంట ప్రశ్న

ఒంగోలు: గ్రామీణ ప్రాంతాల్లో తల్లీ, పిల్లల వైద్య నిపుణుల పెంపుపై ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పార్లమెంట్‌లో ప్రశ్న లేవనెత్తారు. వైద్య నిపుణుల కొరత అధికంగా ఉన్న కారణాలు, ఖాళీలు భర్తీ చేసేందుకు ప్రభుత్వ చర్యలు గురించి వివరాలు కోరారు. దీనికి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మన్సుక్ మాండవీయ మాట్లాడుతూ ప్రజారోగ్య సేవలు కల్పనలో కేంద్రం ప్రాథమిక, ద్వితీయ, తృతీయ స్థాయిల్లోని వైద్యశాలల్లో వైద్య సదుపాయాలను అందిస్తోందన్నారు. తల్లీ పిల్లల వైద్య నిపుణులను కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల్లో నియమించామన్నారు. దేశం మొత్తం గ్రామీణ ప్రాంతాల్లో 1414 తల్లీ పిల్లల వైద్య నిపుణులు, 2518 మంది శిక్షణ పొందిన ఎంబీబీఎస్ వైద్యులు పనిచేస్తున్నారన్నారని చెప్పారు. 38917 మంది అన్ని శాఖల్లో పనిచేస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ల కొరత తీర్చేందుకు 96989 మంది డాక్టర్ సీట్లు , 319 మెడికల్ కాలేజీలను పెంచామని కేంద్రమంత్రి తెలిపారు.

లారీని ఢీకొని బొలెరో దగ్ధం


లారీలో వేలాడుతున్న సెంథిల్ మృతదేహం


దగ్ధమైన బొలెరో వాహనాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సైలు

- లారీ డ్రైవర్ మృతి

మార్కాపురం రూరల్: ఉల్లిపాయల లోడుతో వెళ్తున్న లారీని చెప్పుల లోడుతో వెళ్తున్న బొలెరో వాహన డ్రైవర్ నిద్రమత్తులో ఢీకొనడంతో బొలెరో దగ్ధం కాగా.. లారీ డ్రైవర్ మృతి చెందిన ఘటన ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం నికరంపల్లి వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగింది. మార్కాపురం రూరల్ ఎస్సై వెంకటేశ్వర నాయక్ తెలిపిన వివరాల మేరకు.. ఉల్లిపాయల లోడుతో కర్నూలు నుంచి కలకత్తా వెళ్తున్న లారీని విజయవాడ నుంచి అనంతపురానికి చెప్పుల లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం డ్రైవర్ నిద్రమత్తులో ఢీకొన్నాడు. దీంతో లారీ ముందుభాగం పూర్తిగా దెబ్బతిని లారీ డ్రైవర్ సెంథిల్ కుమార్ (40) అక్కడికక్కడే మృతిచెందాడు. అతని స్వస్థలం తమిళనాడు రాష్ట్రం తరమిపురం గ్రామం. క్లీనర్ ఎస్ సంతోష్ గాయాలతో బయటపడ్డాడు. బొలెరో లారీని ఢీకొనడంతో ఒక్కసారిగా బొలెరో వాహనంలో మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. మంటలు చెలరేగగానే బొలెరో డ్రైవర్‌తో పాటు అందులోని మరో వ్యక్తి అప్రమత్తమై ప్రమాదం నుంచి బయట పడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారి రామకృష్ణ తన సిబ్బందితో వచ్చి బొలెరో వాహనం మంటలు ఆర్పారు.

సంఘటనా స్థలాన్ని ట్రైనీ డీఎస్పీ షెహ్వాజ్, మార్కాపురం సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, రూరల్ ఎస్సై వెంకటేశ్వర నాయక్ పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.